# సాక్షి మంచిర్యాల

సోమవారం । 30 । అక్టోబర్ । 2023




### మిషన్ కుడతా.. ఓటేస్తారా..

ఎన్నికల ప్రచారంలో ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆదివారం రామకృష్ణాపూర్ సూపర్ బజార్ ఏరియాలో ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఓ మహిళ మిషన్ కుడుతూ కనిపించగా ఆమెను పక్కకు జరిపి.. కాసేపు ఇలా మిషన్ కుట్టి సందడి చేశారు.

– రామకృష్ణాపూర్



### వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.3 /19.4

వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. పగలు ఎండగా, ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి చలి ప్రభావం కూడా తగ్గుతుంది.

## న్యూస్‌రీల్

### రిటైర్డ్ కార్మికులకు లాభాల వాటా చెల్లించాలి



మాట్లాడుతున్న సత్యనారాయణ

**మందమర్రిరూరల్:** సింగరేణిలో రిటైర్ అయిన కార్మికులకు 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన లాభాల వాటా చెల్లించాలని ఏఐటీయూసీ మందమర్రి బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఏరియాలోని ఏఐటీయూసీ ఆఫీస్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రిటైర్డ్ కార్మికుల పక్షాన ఆందోళన చేయడానికి వెనుకాడేది లేదన్నారు. సింగరేణిలో కార్మికులకు 13.6 శాతం డీఏను చెల్లించాలని కోలిండియా గతనెల 15న సర్క్యులర్ జారీ చేసినా సింగరేణి యాజమాన్యం చెల్లించడం లేదని ఆరోపించారు. వెంటనే డీఏ చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సుదర్శన్, మల్లయ్య, ప్రభాకర్, బానయ్య తదితరులు పాల్గొన్నారు.

### చెన్నూర్ బరిలో కాంగ్రెస్

- మాజీ ఎమ్మెల్యే బోడ జనార్దన్




మాట్లాడుతున్న బోడ జనార్దన్

**మందమర్రిరూరల్:** చెన్నూర్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ పోటీ చేస్తుందని మాజీ ఎమ్మెల్యే బోడ జనార్దన్ ధీమా వ్యక్తం చేశారు. మందమర్రి ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం మాట్లాడారు. రెండు మూడు రోజుల్లో పెద్దపల్లి మాజీ ఎంపీ, బీజేపీ జాతీయ కార్యవర్గసభ్యుడు వివేక్ కాంగ్రెస్ పార్టీలో చేరుతారని తెలిపారు. అధిష్టానం చెన్నూర్ టికెట్ వివేక్‌కు కేటాయిస్తే తాము కూడా మద్దత ఇచ్చి గెలిపిస్తామని పేర్కొన్నారు. పొత్తులో భాగంగా సీపీఐకి కేటాయించాలని అనుకున్నా చివరి క్షణంలో వివేక్ కాంగ్రెస్‌లో చేరితే ఆయనకే కేటాయించే అవకాశం ఉందని తెలిపారు. మొదట తాను టికెట్ ఆశించానని, వివేక్ పార్టీలోకి వస్తే తాను కూడా మద్దతు ఇస్తానని వెల్లడించారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు మంతెన శ్రీనివాస్, రాంచందర్, పవన్, సుధాకర్, సత్యనారాయణ, ప్రసాద్, బద్రి, రాజు తదితరులు పాల్గొన్నారు.

### రచయితకు సన్మానం



సన్మానం పొందుతున్న మురళీకృష్ణ

**బెల్లంపల్లి:** బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు అధ్యాపకుడు, రచయిత కంబాల మురళీకృష్ణకు ఆత్మీయ సన్మానం జరిగింది. హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం 'సారాంశం' పుస్తకావిష్కరణ జరిగింది. ఆపుస్తకానికి మురళీకృష్ణ సమీక్ష, పరిశోధనాత్మక వ్యాసం రాసినందుకు నిర్వాహకులు సత్కరించారు. సారాంశ పుస్తక సంపాదకుడు అట్టెం దత్తయ్య చేతుల మీదుగా ఈ సత్కారం జరిగింది. అతిథులు తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ నందిని సిద్దారెడ్డి , మూసి సాహిత్య మాస పత్రిక అధినేత ఆచార్య కమలాకర శర్మ, ఓయూ ప్రొఫెసర్ నిత్యానందరావు, కవులు, రచయితలు మురళీకృష్ణను అభినందించారు.

# నత్త నవ్విపోయేలా?



హమాలీవాడలో 60 ఫీట్ల రోడ్డు విస్తరణకు అడ్డుగా ఉన్న ఇళ్లను కూల్చిన దృశ్యం

- కొనసా...గుతున్న రోడ్డు విస్తరణ
- ఆక్రమణల తొలగింపునకు హడావుడి
- పనులు చేయడంలో అలసత్వం
- తరచూ అడ్డుకుంటున్న స్థానికులు



కాలనీవాసులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్



హమాలీవాడలో అడ్డుగా ఉన్నా కూల్చని ఇల్లు

**మంచిర్యాలటౌన్:** మంచిర్యాల మున్సిపాలిటీలో టీయూఎఫ్ఐడీసీ నిధులతో చేపట్టిన రోడ్ల విస్తరణ, డ్రెయినేజీల నిర్మాణం, సెంట్రల్ లైటింగ్ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. మాస్టర్ ప్లాన్ ప్రకారం రోడ్లు విస్తరించాల్సి ఉండగా, కొందరు రహదారులను ఆక్రమించి నిర్మాణాలు చేయడంతో పనులు ఆలస్యమవుతున్నాయి. రోడ్ల విస్తరణతోపాటే మిషన్ భగీరథ పైప్‌లైన్, డ్రెయినేజీల నిర్మాణం చేపట్టాల్సి ఉంది.

**ప్రజాప్రతినిధుల ఒత్తిడి..**

రోడ్లు ఆక్రమించి నిర్మించిన భవనాల కూల్చివేతను కొంతమంది ప్రజాప్రతినిధులు అడ్డుకుంటున్నారు. ఆక్రమణలు కూల్చకుండా అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. హమాలీవాడ భాగ్యలక్ష్మి చికెన్ సెంటర్ నుంచి తిలక్‌నగర్ క్రాస్ రోడ్డు వరకు చేపట్టిన 60 ఫీట్ల రోడ్డు విస్తరణ, సెంట్రల్ లైటింగ్‌తో కూడిన పనులకు రూ.5.85 కోట్లు కేటాయించారు. ఈ ఏడాది జనవరి 27న ఎంపీ వెంకటేశ్‌నేత, ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు శంకుస్థాపన చేశారు. 9 నెలలు గడుస్తున్నా ఇప్పటికీ పనులను పూర్తి చేయలేదు. మరోవైపు ఆక్రమణలు కూల్చడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు.

**కొందరికి మేలు జరిగేలా..**

హమాలీవాడ నుంచి తిలక్‌నగర్ వరకు రోడ్డును ఆక్రమించి కట్టిన రెండు మూడు భవనాలను తొలగించక పోవడమే విస్తరణ పనులకు ఆటంకంగా మారుతోంది. ప్రజాప్రతినిధుల ఒత్తిడితో కొన్ని భవనాలను కూల్చకుండా వదిలేసి, ఇతర ఇళ్లను 60 ఫీట్ల మేర కూల్చివేయడంపై కాలనీవాసులు ఆందోళన చేపట్టారు. దీంతో భాగ్యలక్ష్మీ చికెన్ సెంటర్ నుంచి బాలమల్లు తోట సమీపం వరకు 55 ఫీట్లకు రోడ్డును కుదించారు. ఆ తరువాత 60 ఫీట్ల వరకు విస్తరణ చేపడుతున్నారు. కొందరికి మేలు చేసేలా నిబంధనలకు విరుద్ధంగా విస్తరణను కుదించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికారుల తీరును తప్పుపడుతూ కాలనీవాసులు తరచూ పనులు అడ్డుకుంటున్నారు. హనుమాన్ ఆలయం సమీపంలోని భవనాలు రహదారి విస్తరణకు అడ్డుగా ఉన్నా కూల్చకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డ్రెయినేజీ పనులు, తాగునీటి పైపులైన్ పనులను అడ్డుకుంటున్నారు. అందరికీ ఒకే నిబంధన వర్తింపజేయాలని డిమాండ్ చేస్తున్నారు. మిషన్ భగీరథ పనులు, రోడ్డు విస్తరణ పనులకు ఎదురవుతున్న ఆటంకాలను అధిగమిస్తేనే పనులు పూర్తవుతాయని స్థానికులు పేర్కొంటున్నారు.

# విద్యార్థులకు 'అపార్'



నెన్నెల్ హైస్కూల్‌లో పేరెంట్స్ నుంచి అంగీకారపత్రం తీసుకుంటున్న ప్రధానోపాధ్యాయుడు ప్రకాశ్‌రావు

- ఆధార్ తరహాలో గుర్తింపు కార్డు

**మంచిర్యాలఅర్బన్:** జాతీయ విద్యా విధానం అమలులో భాగంగా దేశ ప్రజలకు యూనిక్ ఐడీ కార్డుగా ఉన్న ఆధార్ తరహాలో విద్యార్థులకు ప్రత్యేక గుర్తింపు కార్డు ఇవ్వాలని కేంద్రం నిర్ణయించింది. ఒకే దేశం.. ఒకే ఐడీ కార్డు పేరుతో ప్రతీ విద్యార్థికి 12 అంకెలతో కూడిన అపార్ (ఏపీఏఏఆర్– ఆటో మేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) అందించనున్నారు. ఎల్‌కేజీ నుంచి పీజీ వరకు సంబంధించి ధృవపత్రాలు సమర్పించడం, మెమోలు జాగ్రత్త చేసుకోవడం చూస్తుంటాం. ఒక్కో స్థాయిలో విద్యార్థికి ఒక్కో ఐడీ క్రియేట్ అవుతుంటాయి. ఈనేపథ్యంలో కేజీ నుంచి పీజీ వరకు ఒకే ఐడీ ఉండాలని ఆధార్ తరహా అపార్ కార్డులు మంజూరు చేయాలని కేంద్ర విద్యావనరుల మంత్రిత్వశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఇందులో భాగంగా శనివారం జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదివే విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అంగీకార పత్రాలు తీసుకున్నారు.

**చైల్డ్ ఇన్‌ఫో ద్వారా..**

జిల్లాలో 1,084 పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 1,29,386 మంది విద్యార్థులు చదువుతున్నారు. పిల్లలకు పాఠశాలస్థాయిలో చైల్డ్ ఇన్‌ఫ్లో ద్వారా ఒక ఐడీ కేటాయించనున్నారు. కళాశాల స్థాయిలో మరో ఐడీ ఉంటుంది. కేంద్ర ప్రభుత్వ తీసుకురానున్న అపార్ కార్డులోనే పూర్తి సమాచారం అందనుంది. అపార్డ్ కార్డు ద్వారా విద్యార్థులకు కేటాయించే సంఖ్యను విద్యార్థి జీవిత కాలం ఐడీగా పరిగణించనున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యార్థులందరికీ అపార్ కార్డు ఇవ్వనున్నారు. విద్యార్థికి సంబంధించిన పూర్తి వివరాలు ఇందులో ఉంటాయి. కేజీ టూ పీజీ విద్యాసంవత్సరం వివరాలు, సాధించి విజయాలు, స్కాలర్‌షిప్‌లు, మెమోలు, ధ్రువపత్రాలు, ఆధార్ అనుసంధానం, కుటుంబ వివరాలు పొందుపరుస్తారు. అన్ని వివరాలు కార్డులో నిక్షిప్తం చేయడం వలన ఏదైనా ఎంట్రన్స్ పరీక్ష దరఖాస్తుకు అపార్ సంఖ్య కేటాయిస్తే సరిపోతుందని తెలుస్తోంది.

**తల్లిదండ్రుల అనుమతి తప్పనిసరి..**

అపార్ కార్డు పొందేందుకు తల్లిదండ్రుల అంగీకారం పత్రం తప్పనిసరి. జిల్లాలో సర్కారు బడుల్లో శనివారం పేరెంట్స్ టీచర్ మీటింగ్‌లో అపార్ కార్డుపై చర్చించారు. అపార్డ్ కార్డు ప్రాముఖ్యతపై వివరించారు. కొంత మంది తల్లిదండ్రులు అపార్ కార్డు కోసం అంగీకార పత్రం అందించినట్లు అధికారులు చెబుతున్నారు.

### విద్యార్థులకు ఉపయోగకరం

అపార్ కార్డు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. తల్లిదండ్రుల అనుమతితోనే అపార్ కార్డు ఇవ్వనున్నారు. పాఠశాల హెచ్ఎంలు సమావేశాలు నిర్వహించి తల్లిదండ్రుల నుంచి అంగీకార పత్రాలు తీసుకుంటారు. – యాదయ్య, డీఈవో

# ఆటో కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి




ప్రజా ఎజెండా కార్యక్రమంలో పాల్గొన్న ఆటో డ్రైవర్లు

- ఆటో డ్రైవర్ల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలి
- పార్కింగ్‌స్థలాలు గుర్తించి ఇబ్బందులు లేకుండా చూడాలి
- ఆర్టీవో ఆఫీసుల్లో బ్రోకర్లు లేకుండా లైసెన్స్‌లు జారీ చేయాలి
- ఆటో డ్రైవర్లకు బీమా వర్తింపజేయాలి

**బెల్లంపల్లి:** రాష్ట్రంలో డిసెంబర్ 3 తర్వాత ఏర్పడే ప్రభుత్వం ఆటో డ్రైవర్ల సంక్షేమానికి తగిన ప్రాధాన్యం ఇవ్వాలని, ఆటో కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, ఆటో డ్రైవర్లకు బీమా వర్తింపజేయాలని బెల్లంపల్లి ఆటో డ్రైవర్లు డిమాండ్ చేశారు. బెల్లంపల్లి ఏఎంసీ క్రీడా మైదానంలో 'సాక్షి ' ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ప్రజాఎజెండా కార్యక్రమంలో పలువురు ఆటో డ్రైవర్లు తమ సమస్యలను ఏకరువు పెట్టారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి మున్సిపాలిటీల్లో ప్రత్యేక పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయాలన్నారు. ఆర్టీవో ఆఫీసుల్లో దళారీ వ్యవస్థ లేకుండా ప్రభుత్వం ఉచితంగా డ్రైవింగ్ లైసెన్స్‌లు జారీ చేయించాలన్నారు. ఆటో డ్రైవర్లకు హెల్త్ కార్డులు జారీ చేయాలని, ఈఎస్ఐ సౌకర్యం కలిపించాలని కోరారు. 50 ఏళ్లు నిండిన ఆటో డ్రైవర్లకు పెన్షన్ వర్తింపజేయాలని పేర్కొన్నారు. సంక్షేమ పథకాల్లో ఆటో డ్రైవర్లకు ప్రత్యేక కోటా కేటాయించాలని కోరారు. ఈ సందర్భంగా పలువురి ఆటో డ్రైవర్ల డిమాండ్లు వారి మాటల్లో..

### సంక్షేమ పథకాల్లో కోటా కావాలి



ఆటో డ్రైవర్ల సమస్యలను ఏ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఎస్సీ, ఎస్టీ, బీసీ ఇతర సామాజిక వర్గాలకు కల్పిస్తున్న మాదిరిగానే సంక్షేమ పథకాల్లో ఆటో డ్రైవర్లకు ప్రత్యేక కోటా ఇవ్వాలి. డ్రైవర్ల జీవనోపాధి మెరుగుపర్చేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.

– కట్ల రామ్‌కుమార్

### క్లియరెన్స్ ఇప్పించాలి



ఏ ఆధారం లేకనే డ్రైవర్ వృత్తిని ఎంచుకున్నాం. అనేకమంది డ్రైవర్లు ప్రైవేట్ ఫైనాన్స్, ప్రైవేట్ బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని ఆటోలు కొన్నారు. అయితే రుణం తీర్చినా ఫైనాన్స్ సంస్థలు లోన్ క్లియరెన్స్ ఇవ్వడం లేదు. ప్రభుత్వం చొరవ తీసుకుని క్లియరెన్స్ ఇప్పించాలి.

– గొడిసెల వెంకటేశ్వర్లు

### పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయాలి



నగరాలు, పట్టణాలు, మేజర్ గ్రామపంచాయతీల్లో ఆటోల కోసం ప్రత్యేకంగా పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయాలి. కొన్ని చోట్ల స్థలం కేటాయించినా అన్యాక్రాంతమైంది. కొత్త ప్రభుత్వం పార్కింగ్ సమస్య పరిష్కరించాలి. – బొెట్టి రాజేశం

### హెల్త్ కార్డులు ఇప్పించాలి



పేద కుటుంబాల నుంచే ఆటో డ్రైవర్లు వస్తున్నారు. డ్రైవర్లు, కుటుంబ సభ్యులు అనారోగ్యం పాలైతే చేతిలో చిల్లిగవ్వ లేక ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం హెల్త్‌కార్డులు జారీ చేయాలి.

– బియ్యాల సత్తయ్య

### ఆటోబీమా అమలు చేయాలి



రైతుల కోసం ప్రభుత్వం రైతుబీమా అమలు చేస్తున్నట్లుగానే ఆటో డ్రైవర్లను ఆదుకోవడానికి కొత్త ప్రభుత్వం ఆటోబీమా పథకం అమలు చేయాలి. ఏ కారణంగా అయినా డ్రైవర్ మృతిచెందితే బీమా ద్వారా బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందించాలి.

– దుర్గం అర్జున్

### ఆటో కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



సమాజంలో ఆటో డ్రైవర్లంటే అందరికి చిన్న చూపే. ప్రభుత్వ పథకాల్లో వివక్ష చూపుతున్నారు. ఆటో డ్రైవర్ల ఉన్నతికోసం కొత్తగా ఏర్పడే ప్రభుత్వం ఆటో కార్పొరేషన్ ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి. స్వ యం ఉపాధి కల్పనకు తోడ్పాటు అందించాలి. – ఆత్మూరి సారయ్య

# కాంగ్రెస్ గెలిస్తేనే ప్రైవేటీకరణకు బ్రేక్!

- ఐఎన్టీయూసీ జనరల్ సెక్రెటరీ జనక్ ప్రసాద్




మాట్లాడుతున్న జనక్ ప్రసాద్

**శ్రీరాంపూర్:** వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలిచి అధికారంలోకి వస్తే సింగరేణిలో ప్రైవేటీకరణ ఆగుతుందని ఐఎన్టీయూసీ జనరల్ సెక్రెటరీ బి.జనక్‌ప్రసాద్ అన్నారు. నస్పూర్– శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో యూనియన్ జనరల్ బాడీ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణిని కాపాడుకోవాలంటే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. బీఆర్ఎస్ గెలిస్తే సింగరేణి పూర్తిగా ప్రైవేట్ పరం అవుతుందని తెలిపారు. కేసీఆర్ సర్కార్ ఒప్పుకోవడంతోనే మోదీ సర్కార్ సింగరేణిలోని నాలుగు బొగ్గు బ్లాకులను వేలం వేసిందన్నారు. గత ఎన్నికల ముందు సింగరేణిలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటు చేస్తామన్న కేసీఆర్ గెలిచిన తర్వాత విస్మరించారన్నారు. ఇన్నాళ్లు మోదీ సర్కార్ చేసిన చట్టాలకు కేసీఆర్ ప్రభుత్వం సహకరిస్తూ వచ్చిందన్నారు. సింగరేణి విస్తరించి ఉన్న ఆరు జిల్లాల్లోని 12 నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సింగరేణి ఎన్నికల్లో ఐఎన్టీయూసీని గెలిపించాలన్నారు. సమావేశంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి కాంపల్లి సమ్మయ్య, సీనియర్ ఉపాధ్యక్షుడు నరసింహారెడ్డి, సిద్దంశెట్టి రాజమౌళి, శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు జె.శంకర్‌రావు, కేంద్ర ఉపాధ్యక్షుడు గరిగె స్వామి, కలవేని శ్యాం, జిల్లా అధ్యక్షుడు నరేందర్ నాయకులు, సమ్ము రాజయ్య, దేవి భూమయ్య, శీలం చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ రాజ్యం.. బీఆర్ఎస్‌తోనే సాధ్యం

- ప్రభుత్వ విప్ బాల్క సుమన్



ఆర్కేపీలో ఇంటింటి ప్రచారం చేస్తున్న సుమన్

**రామకృష్ణాపూర్:** పోరాడి సాధించుకున్న తెలంగాణలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కొనసాగాలంటే బీఆర్ఎస్‌ను మళ్లీ గెలిపించాలని ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్కసుమన్ కోరారు. పట్టణంలోని సూపర్‌బజార్ ఏరియాలోని సాయిబాబా ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేసి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. కాంగ్రెస్, బీజేపీ పాలనను గతంలోనే చూశామని నాలుగు ఓట్ల కోసం ఆ పార్టీ నాయకులు ఆపద మొక్కులు మొక్కుతున్నారని ఎద్దేవా చేశారు. చెన్నూర్ నియోజకవర్గంలో గతంలో ఎన్నడూలేని విధంగా అభివృద్ధి పనులు చేపట్టామని అన్నారు. రామకృష్ణాపూర్ పట్టణంలో సింగరేణి స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి పట్టాలు ఇచ్చిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందని తెలిపారు. క్యాతనపల్లి మున్సిపాలిటీలో ఇప్పటికే రూ.220 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభించామని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరింత అభివృద్ధి, సంక్షేమ ఫలాలు సాధించాలంటే బీఆర్ఎస్‌కే పట్టంకట్టాలని కోరారు. గత ఎన్నికల్లో 88 సీట్లు సాధించిన బీఆర్ఎస్ ఈ సారి సెంచరీ కొడుతుందని ధీమా వ్యక్తంచేశారు. సూపర్ బజార్ ఏరియాలోని వర్తక, వ్యాపార సముదాయాలతోపాటు 14, 12, 11వ వార్డులలో ఎమ్మెల్యే గడపగడపకు వెళ్తూ ముమ్మరంగా ప్రచారం చేశారు. ఆయన వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ, బీఆర్ఎస్ పట్టణ ఇన్‌చార్జ్ గాండ్ల సమ్మయ్య, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

### వారసంతలో ప్రచారం

సాయంత్రం కనకదుర్గాకాలనీలో, ఆదివారం సంతలో ప్రచారం చేశారు. పుట్టిన బిడ్డ తల్లి చేతిలో ఉంటే ఎంత భద్రంగా ఉంటుందో పోరాటం చేసి, కష్టపడి సాధించుకున్న తెలంగాణ కేసీఆర్ చేతిలో ఉంటేనే అంత భద్రంగా ఉంటుందని పేర్కొన్నారు. సింగరేణి ఇళ్ల పట్టాలు రానివారికి ఎన్నికలవగానే ఇస్తామని హామీ ఇచ్చారు.

# కేసీఆర్‌తోనే సింగరేణికి భవిష్యత్తు

- పెద్దపల్లి ఎంపీ బోర్లకుంట వెంకటేశ్‌నేత




మాట్లాడుతున్న వెంకటేశ్‌నేత

**శ్రీరాంపూర్:** కేసీఆర్ ముఖ్యమంత్రి అయితేనే సింగరేణికి భవిష్యత్తు ఉంటుందని పెద్దపెల్లి ఎంపీ బోర్లకుంట వెంకటేశ్ నేత తెలిపారు. నస్పూర్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో టీబీజీకేఎస్ డివిజన్ కార్యకర్తల సమావేశం ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంపీ హాజరై మాట్లాడారు. సింగరేణి కార్మికులకు గతంలో ఏ ముఖ్యమంత్రి చేయనన్ని సంక్షేమ కార్యక్రమాలను కేసీఆర్ చేశారన్నారు. జాతీయ సంఘాలు పోగొట్టిన వారసత్వ ఉద్యోగాలను తిరిగి ఇప్పిచ్చారని, నేడు వేలాది మంది యువ కార్మికులు కారుణ్య ఉద్యోగాలు చేయడం కేసీఆర్ పుణ్యమే అన్నారు. సింగరేణిని మోదీ సర్కార్ ప్రైవేట్ పరం చేయడానికి కుట్ర చేస్తుందని, రాష్ట్రంలో బీఆర్ఎస్ సర్కార్ ఉంటే ఈ ఆటలు సాగవన్నారు. అనంతరం ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ భానుప్రసాద్ మాట్లాడుతూ కేసీఆర్‌ను హ్యాట్రిక్ సీఎంగా గెలిపించాలని కోరారు. మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావు మాట్లాడుతూ 2014లో కేసీఆర్ ముఖ్యమంత్రి కాకుంటే సింగరేణి ఎలా ఉండేదో ఊహించుకోవాలన్నారు. మంచిర్యాల నుంచి శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం వరకు జరిగిన రోడ్డు విస్తరణ, సెంట్రల్ లైటింగ్, గోదావరిపై కొత్తగా బ్రిడ్జి, ఇలా ఎన్నో అభివృద్ధి పనులు చేయించానన్నారు. మరోసారి నియోజకవర్గంలో గులాబీ జెండా ఎగరాలన్నారు. అనంతరం గుర్తింపు సంఘం టీబీజీకేఎస్ అధ్యక్షుడు బి.వెంకట్రావు మాట్లాడుతూ కోల్ ఇండియాలో లేని హక్కులను సింగరేణిలో కల్పించామన్నారు. మంచిర్యాలలో దివాకర్‌రావుతోపాటు సింగరేణి గుర్తింపు ఎన్నికల్లో టీబీజీకేఎస్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గడ్డం అరవింద్‌రెడ్డి, టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య, నస్పూర్ మున్సిపల్ చైర్మన్ ప్రభాకర్, టీబీజీకేఎస్ కేంద్రం ఉపాధ్యక్షులు డి.అన్నయ్య, మంద మల్లారెడ్డి, బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి నాయకులు ఏనుగు రవీందర్‌రెడ్డి, పెట్టం లక్ష్మణ్, వెంగళ కుమారస్వామి, పానుగంటి సత్తయ్య, పార్టీ మండల అధ్యక్షుడు సుబ్బయ్య, ప్రధాన కార్యదర్శి పవన్ కుమార్, ఉపాధ్యక్షుడు సంతోష్‌చారి తదితరులు పాల్గొన్నారు.

# కడుపులో పెట్టుకుని చూసుకుంటా

- కాంగ్రెస్ అభ్యర్థి వెడ్మ బొజ్జు



సమావేశంలో మాట్లాడుతున్న బొజ్జు

**జన్నారం:** తాను కాంగ్రెస్ పార్టీ కోసం ఏళ్లుగా పనిచేస్తున్నానని, ఇంకో 28 రోజులు నాయకులు, కార్యకర్తలు పార్టీ కోసం పనిచేసి తనను గెలిపిస్తే అందరినీ కడుపులో పెట్టుకుని చూసుకుంటానని ఖానాపూర్ కాంగ్రెస్ అభ్యర్థి వెడ్మ బొజ్జు అన్నారు. జన్నారం మండలం ఇందన్‌పల్లి ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం పూజలు చేశారు. అనంతరం ఇందన్‌పల్లి నుంచి జన్నారం వరకు ర్యాలీగా వచ్చారు. మండల కేంద్రంలోని అంబేద్కర్, తెలంగాణ తల్లి, జయశంకర్ విగ్రహాలకు పూలమాలలు వేశారు. తర్వాత పార్టీ కార్యాలయం ఆవరణలో మాట్లాడారు. ఖానాపూర్ నియోజకవర్గంలో అభివృద్ధి కుంటుపడేందుకు మంత్రి కేటీఆర్ ప్రధాన కారణమన్నారు. నియోజకవర్గానికి నిధులు మంజూరైనా పనులు జరుగకుండా అడ్డుకున్నారని ఆరోపించారు. అభివృద్ధి నిరోధక బీఆర్ఎస్ పార్టీకి ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని కోరారు. నియోజకవర్గంలో స్థానికుడినైన తాను అందరికీ అందుబాటులో ఉంటానని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీ స్కీంలు అమలు చేస్తామని వెల్లడించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పని చేద్దామన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ముజాఫర్ అలీఖాన్, జిల్లా ప్రధాన కార్యదర్శులు గుర్రం మోహన్‌రెడ్డి, రాజన్న, సీనియర్ నాయకులు శుభాష్‌రెడ్డి, రాజశేఖర్, మాజీ ఎంపీపీ శంకరయ్య, ఫసీఉల్లా, మాణిక్యం, సయ్యద్ ఇసాక్, సోహెల్, హేమంత్‌చారి తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### గుడుంబా స్థావరాలపై దాడులు



బెల్లంపానకం ధ్వంసం చేస్తున్న ఎస్సై

**నెన్నెల:** మండలంలోని శ్రావణ్‌పల్లిలో గుడుంబా స్థావరాలపై ఆదివారం పోలీసులు దాడులు నిర్వహించినట్లు ఎస్సై శ్యాంపటేల్ తెలిపారు. ఈ దాడుల్లో 25 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని మామిడి తోటల్లో పాతిపెట్టిన 200 లీటర్ల బెల్లంపానకం ధ్వంసం చేసినట్లు ఆయన పేర్కొన్నారు. గ్రామానికి చెందిన డేగరి వెంకటేశ్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

### అదృశ్యమైన వ్యక్తి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

**లక్సెట్టిపేట(మంచిర్యాల):** మండలంలోని వెంకట్రావుపేటలో ఈ నెల 24న అదృశ్యమైన వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై లక్ష్మణ్ తెలిపారు. గ్రామానికి చెందిన బీరయ్య (38) కొంతకాలంగా మానసిక వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ నెల 24న ఇంటినుంచి బయటికి వెళ్లి తిరిగిరాలేదు. ఆదివారం చెల్లంపేట గ్రామ శివారులో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

### కుక్క కాటుతో బాలుడికి గాయాలు



గాయాలపాలైన బాలుడు

**బెజ్జూర్:** మండలంలోని సులుగుపల్లి గ్రామానికి చెందిన ఆత్రం ఆదిత్య అనే బాలుడిని కుక్క కాటువేసింది. ఆదివారం ఉదయం బాలుడు తన ఇంటి బయట ఆడుకుంటుండగా కాలు, వెన్నుపై కరవడంతో గాయాలయ్యాయి. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

### మోసగించిన వ్యక్తిపై కేసు

**ఆదిలాబాద్‌రూరల్:** యజమానికి తెలియకుండా బ్యాంక్ అకౌంట్ నుంచి చెక్కుల ద్వారా నగదు ట్రాన్స్‌ఫర్ చేయించుకుని మోసగించిన ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని ఓల్డ్ హౌజింగ్ బోర్డు కాలనీకి చెందిన ప్రణేష్ మావలలోని శ్రీ వినాయక ఫిల్లింగ్ స్టేషన్‌లో ఫిబ్రవరి నుంచి మేనేజర్‌గా పనిచేస్తున్నారు. పెట్రోల్ పంపులో డీజిల్, పెట్రోల్ ఆవిరి ఆవుతుందని రూ.11 లక్షల నష్టం చూపించారు. అనుమానం వచ్చిన యాజమాని సౌందర్‌పెల్లి శ్రీకర్ అతన్ని ఇటీవల విధుల నుంచి తొలగించారు. సంతకాలు చేసి ఉన్న ఆరు చెక్కులతో పాటు పెట్రోల్ పంపునకు సంబంధించిన లైసెన్స్, ఇతర విలువైన పత్రాలను యాజమానికి తెలియకుండా తీసుకెళ్లాడు. ఈ నెల 24న ప్రణేష్ ఖాతాలోకి రూ.35 లక్షలు ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నారు. పెట్రోల్ బంక్ యాజమాని శ్రీకర్ ఫిర్యాదు మేరకు ప్రణేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

# 3,48,736

గత ఎన్నికల్లో ఓటేయనివారు



| నియోజకవర్గం | మొత్తం ఓటర్లు | పోలైన ఓట్లు | ఓటు వేయనివారు |
|---|---|---|---|
| నిర్మల్ | 2,16,777 | 1,71,664 | 45,113 |
| ముధోల్ | 2,16,784 | 1,82,585 | 34,249 |
| ఖానాపూర్ | 1,87,893 | 1,51,338 | 36,555 |
| ఆదిలాబాద్ | 2,01,139 | 1,64,438 | 36,701 |
| మంచిర్యాల | 2,27,000 | 1,65,727 | 61,273 |
| ఆసిఫాబాద్ | 1,86,311 | 1,60,252 | 26,059 |
| బోథ్ | 1,82,997 | 1,56,039 | 26,958 |
| సిర్పూర్ | 1,90,934 | 1,63,888 | 27,046 |
| చెన్నూర్ | 1,64,203 | 1,35,175 | 29,028 |
| బెల్లంపల్లి | 1,52,905 | 1,27,151 | 25,754 |

## పోలింగ్ శాతంపై ప్రభావం

**బైంసాటౌన్ (ముధోల్):** 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ భారత రాజ్యాంగం ఓటుహక్కు కల్పించింది. ఎందుకంటే ప్రజాస్వామ్య దేశంలో ప్రజల చేత ఎన్నుకోబడినవారే నాయకులు. ఇలా ఎన్నుకోబడినవారు ప్రజారంజక పాలన చేయకపోతే తిరిగి సమర్థుడైన నాయకుడిని ఎన్నుకోవాలనే ఉద్దేశంతో ఎన్నికల సంఘం ఐదేళ్లకోసారి ఎన్నికలు నిర్వహిస్తోంది. ఎంతో వ్యయప్రయాసలకోర్చి ఈ ప్రక్రియ నిర్వహిస్తుండగా చాలామంది పోలింగ్‌రోజును సెలవుదినంగా భావించి ఇళ్లకు, వ్యక్తిగత పనులకు పరిమితమవుతున్నారు. మనప్రాంత అభివృద్ధిపై నిలదీయాలంటే ముందుగా ఓటు వేయాలి. ఓటు వేయకపోతే ప్రశ్నించే హక్కు కోల్పోయినట్లే. నవంబర్ 30న పోలింగ్ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా ఓటుహక్కు వినియోగించుకోవాల్సిన అవసరం ఉంది.

గత అసెంబ్లీ ఎన్నికలు పరిశీలిస్తే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో దాదాపు 3.5 లక్షల మంది పోలింగ్‌కు దూరంగా ఉన్నారు. అంటే సుమారుగా రెండు చిన్న నియోజకవర్గాల్లోని ఓటర్ల సంఖ్యకు సమానంగా ఓటుహక్కు వినియోగించుకోలేదంటే అతిశయోక్తి కాదు. ఓటు వేయడంపై ఇప్పటికీ చాలామంది ఆసక్తి చూపడం లేదు. పోలింగ్ కేంద్రాల్లో గంటల తరబడి క్యూలో నిల్చోవడం, పోలింగ్‌రోజున ఇతర ప్రాంతాలకు వెళ్లడం, వ్యక్తిగత పనులకు ప్రాధాన్యం ఇవ్వడం, మారుమూల గ్రామాలు, రోడ్డు సౌకర్యం లేని ప్రాంతాల్లో పోలింగ్ శాతంపై ప్రభావం చూపుతోంది.

జంగ్ తెలంగాణ

- ఉమ్మడి జిల్లాలో పోలింగ్‌కు దూరం
- ఓటింగ్‌పై అనాసక్తి

### పోలింగ్ శాతం పెంచేందుకు...

ఈసారి పోలింగ్ శాతం పెంచేందుకు ఎన్నికల సంఘం అన్ని చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా దివ్యాంగులు, వృద్ధులు ఇంటి నుంచే ఓటుహక్కు వినియోగించుకునే అవకాశం కల్పించింది. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు గంటల తరబడి క్యూలో నిల్చునే ప్రయాస తగ్గించేలా కొత్త పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. అధిక సంఖ్యలో ఓటర్లు ఉన్న కేంద్రాల్లో అదనపు కేంద్రాలు ఏర్పాటు చేశారు.

### శాసనసభ ఎన్నికలు నవంబర్‌లో రెండోసారి

**మంచిర్యాలటౌన్:** రాష్ట్ర శాసనసభకు నవంబర్ 30న జరగనున్న ఎన్నికలు ఇదేమాసంలో రెండోసారిగా గుర్తింపు పొందనున్నాయి. దాదాపు మూడు దశాబ్దాల తర్వాత నవంబర్ నెలలో రాష్ట్ర శాసనసభకు ఎన్నికలు జరగనున్నాయి. 1952లో దేశంలో మొట్టమొదటిసారిగా రాష్ట్రాలకు ఎన్నికలు జరిగాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 1989 నవంబర్ 22 న ఎన్నికలు నిర్వహించారు. రాష్ట్రంలో జరిగిన పలు ఉప ఎన్నికలను మినహాయిస్తే, రాష్ట్ర అసెంబ్లీకి 34 ఏళ్ల తర్వాత నవంబర్‌లో అంటే 2023 నవంబర్ 30న ఎన్నికలు జరగడం రెండోసారి.

ఎన్నికలు జరిగిన తేదీలు

| సంవత్సరం | నెల | తేదీ |
|---|---|---|
| 1952 | - | - |
| 1957 | ఫిబ్రవరి | 25 |
| 1962 | ఫిబ్రవరి | 08 |
| 1972 | మార్చి | 15 |
| 1978 | ఫిబ్రవరి | 25 |
| 1983 | మే | 01 |
| 1985 | మే | 03 |
| 1989 | నవంబర్ | 22 |
| 1994 | డిసెంబర్ | 01 |
| 1999 | సెప్టెంబర్ | 18 |
| 2004 | ఏప్రిల్ | 20 |
| 2009 | ఏప్రిల్ | 16 |
| 2014 | ఏప్రిల్ | 30 |
| 2018 | డిసెంబర్ | 07 |

## ఆసిఫాబాద్‌ను ఏలిన ఆ నలుగురు..

- ఆసిఫాబాద్ ఎమ్మెల్యేలుగా గెలిచిన బెల్లంపల్లి నాయకులు
- మూడుసార్లు గెలిచి హ్యాట్రిక్ సాధించిన గుండా మల్లేశ్
- రెండుసార్లు విజయం సాధించిన దాసరి నర్సయ్య
- ఒక్కోసారి గెలిచిన పాటి సుభద్ర, అమురాజుల శ్రీదేవి



పాటి సుభద్ర



అమురాజుల శ్రీదేవి



దాసరి నర్సయ్య



గుండా మల్లేశ్

**ఉమ్మడి ఆసిఫాబాద్ ఎస్సీ అసెంబ్లీ నియోజకవర్గాన్ని బెల్లంపల్లికి చెందిన నలుగురు రాజకీయ నాయకులు వరుసగా 33ఏళ్లుగా ఏలారు. నలుగురూ కలిసి మొత్తంగా ఏడు పర్యాయాలు ఎమ్మెల్యేలుగా గెలిచి సత్తా చాటారు. బెల్లంపల్లి ప్రాంత వాస్తవ్యులైన దాసరి నర్సయ్య (కాంగ్రెస్), గుండా మల్లేశ్ (సీపీఐ), పాటి సుభద్ర, అమురాజుల శ్రీదేవి (టీడీపీ)కి నియోజకవర్గ ప్రజలు పట్టం కట్టి ఆదరించారు.**

**బెల్లంపల్లి:** 1952 జనరల్ ఎన్నికలతో పాత ఆసిఫాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ఏర్పాటైంది. ఈ నియోజకవర్గం పరిధిలో ఆసిఫాబాద్, వాంకిడి, రెబ్బెన, తిర్యాణి, తాండూర్, భీమిని మండలాలతో పాటు పారిశ్రామిక క్షేత్రం బెల్లంపల్లి ప్రధాన పట్టణంగా ఉండేది. 2009లో నియోజకవర్గాల పునర్విభజనలో బెల్లంపల్లి కొత్త అసెంబ్లీ నియోజకవర్గంగా ఏర్పడింది. అప్పటి వరకు ఉమ్మడి ఆసిఫాబాద్ నియోజకవర్గానికి 12 సార్లు ఎన్నికలు జరిగాయి. ఇందులో 1952లో తొలిసారి జరిగిన ఎన్నికల్లో కొండా లక్ష్మణ్ బాపూజీ (కాంగ్రెస్), 1957లో జరిగిన మలి విడత ఎన్నికల్లో జి.నారాయణరెడ్డి (కాంగ్రెస్) విజయం సాధించారు. ఆ తర్వాత 1962లో జరిగిన ఎన్నికల్లో ఆసిఫాబాద్ నియోజకవర్గాన్ని ఎస్టీలకు రిజర్వు చేశారు. ఆ తదుపరి 1967, 1972 ఎన్నికల వరకు ఎస్టీ అభ్యర్థులకు పోటీ చేసే అవకాశం దక్కింది. వరుసగా ఆ మూడు ఎన్నికల్లోనూ గిరిజన నాయకుడు కొట్నాక భీంరావు (కాంగ్రెస్) ఎమ్మెల్యేగా ఎన్నికై రాజకీయ ఆధిపత్యాన్ని చాటుకున్నారు.

**1978లో ఎస్సీ రిజర్వుడ్..**

ఉమ్మడి ఆసిఫాబాద్ నియోజకవర్గాన్ని 1978లో ఎస్సీలకు రిజర్వు చేశారు. అంతకు ముందు వరకు ఆసిఫాబాద్ ప్రాంత నాయకులు ఎమ్మెల్యేగా ఎన్నిక కాగా బెల్లంపల్లి ప్రాంత నాయకులకు ఆ భాగ్యం కలుగలేదు. ఎస్సీలకు రిజర్వు చేసినప్పటి నుంచి బెల్లంపల్లి రాజకీయ నాయకుల దశ మారింది. వరుసగా 1978, 1983, 1985 (ఉప ఎన్నికలు), 1989, 1994, 1999, 2004లో జరిగిన సాధారణ ఎన్నికల్లో బెల్లంపల్లి వాస్తవ్యులైన కాంగ్రెస్, సీపీఐ, టీడీపీ నాయకులు ఎమ్మెల్యేలుగా విజయం సాధించి ఆసిఫాబాద్‌పై పట్టు బిగించారు.

**హ్యాట్రిక్ సాధించిన గుండా మల్లేశ్..**

ఎస్సీలకు రిజర్వు చేసిన తర్వాత ఆసిఫాబాద్ నియోజకవర్గంపై బెల్లంపల్లి ప్రాంత రాజకీయ నాయకులకు ఎదురులేకుండా పోయింది. 1978 ఎన్నికల నుంచి 2004 ఎన్నికల వరకు బెల్లంపల్లి నేతలే వరుసగా ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. 1978లో జరిగిన ఎన్నికల్లో దాసరి నర్సయ్య (కాంగ్రెస్), 1983లో జరిగిన ఎన్నికల్లో గుండా మల్లేశ్ (సీపీఐ), 1985లో జరిగిన ఉప ఎన్నికల్లోనూ గుండా మల్లేశ్ ఘన విజయం సాధించారు. 1989లో జరిగిన సాధారణ ఎన్నికల్లో రెండోసారి దాసరి నర్సయ్య, 1994లో జరిగిన ఎన్నికల్లో గుండా మల్లేశ్ మూడోసారి గెలుపొంది హ్యాట్రిక్ సాధించారు. 1999లో జరిగిన ఎన్నికల్లో డాక్టర్ పాటి సుభద్ర (టీడీపీ) విజయ బావుటా ఎగురవేసి తొలి మహిళా ఎమ్మెల్యేగా ఖ్యాతి గడించారు. 2004లో జరిగిన ఎన్నికల్లో అమురాజుల శ్రీదేవి (టీడీపీ) విజయం సాధించారు. ఆసిఫాబాద్ నియోజకవర్గం నుంచి మూడు దఫాలు ఎమ్మెల్యేగా గెలిచి గుండా మల్లేశ్ రికార్డు సృష్టించారు. రెండుసార్లు దాసరి నర్సయ్య, పాటి సుభద్ర, అమురాజుల శ్రీదేవి ఒక్కోసారి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించారు. 2009లో ఏర్పడిన బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీచేసిన గుండా మల్లేశ్ విజయం సాధించి తొలి ఎమ్మెల్యేగా గుర్తింపు పొందారు. ఆసిఫాబాద్, బెల్లంపల్లి నియోజకవర్గాల్లో మొత్తంగా నాలుగు సార్లు గుండా మల్లేశ్ విజయం సాధించారు.

ఎమ్మెల్యేలుగా ఎన్నికైన బెల్లంపల్లి నేతల వివరాలు

| సంవత్సరం | ఎన్నికైన నేత | రాజకీయపార్టీ |
|---|---|---|
| 1978 | దాసరి నర్సయ్య | కాంగ్రెస్ |
| 1983 | గుండా మల్లేశ్ | సీపీఐ |
| 1985 | గుండా మల్లేశ్ | సీపీఐ |
| 1989 | దాసరి నర్సయ్య | కాంగ్రెస్ |
| 1994 | గుండా మల్లేశ్ | సీపీఐ |
| 1999 | పాటి సుభద్ర | టీడీపీ |
| 2004 | అమురాజులశ్రీదేవి | టీడీపీ |

## ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత



శ్రీనివాస కల్యాణ ఘట్టంలో భక్తులు

**మంచిర్యాలరూరల్(హాజీపూర్):** నేటి యాంత్రిక జీవనంలో ఆధ్యాత్మిక చింతన సాగించడం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని శ్రీహనుమాన్ దీక్షా సేవా సమితి వ్యవస్థాపకులు, పీఠాధిపతి శ్రీదుర్గాప్రసాద్ స్వామీజీ అన్నారు. కోటి హనుమాన్ చాలీసా పారాయణ మహాయజ్ఞంలో భాగంగా చేపడుతున్న ప్రచారరథం ఆదివారం హాజీపూర్‌కు చేరుకుంది. గుమ్మి ప్రదీప-రమేశ్‌రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో కల్యాణ మూర్తులను అనంతశ్రీ కాలనీలో ఊరేగింపు జరిపి కళ్యాణ ఘట్టాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవడంతో పాటు ప్రతీరోజు హనుమాన్ చాలీసా పఠించడం వలన మానసిక ప్రశాంతత, ఆరోగ్యం చేకూరుతాయన్నారు. 2024 జనవరి 22న అయోధ్యలో శ్రీరామచంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠ, కుంభాభిషేక మహోత్సవం జయప్రదం కావాలనే సంకల్పంతో జనవరి 21న తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీ ప్రాంగణంలో లక్ష మందితో సామూహిక శ్రీహనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే 2020 నుంచి కోటి హనుమాన్ చాలీసా పారాయణ మహాయజ్ఞం ప్రచార రథంతో గ్రామగ్రామాన పర్యటిస్తున్నట్లు తెలిపారు.

## 'సింగరేణి టెండర్లు బహిష్కరిస్తున్నాం'

**మందమర్రిరూరల్:** సింగరేణి ఇటీవల పిలిచిన నాలుగు టెండర్లను బహిష్కరిస్తున్నామని తెలంగాణ కాంట్రాక్టర్స్ టిప్పర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.శంకర్ తెలిపారు. ఆదివారం యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇరవై ఏళ్లుగా టిప్పర్లు నడుపుతున్నా గిట్టుబాటు రాక అప్పుల పాలయ్యామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర ఏరియాల నుంచి టెండర్లు వేయడం వలన స్థానిక కాంట్రాక్టర్లు నష్టపోవాల్సి వస్తోందన్నారు. ఇక నుంచి ఇతర ప్రాంతాల నుంచి వేసిన టెండర్లను అడ్డుకుంటామని హెచ్చరించారు. అంతకు ముందు అసోసియేషన్ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జి.శంకర్, గౌరవ అధ్యక్షుడిగా ప్రవీణ్‌రావు, ఉపాధ్యక్షులుగా రత్నాకర్‌రావు, కార్యదర్శిగా జి.రాజం, కోశాధికారిగా తిరుపతి, కార్యవర్గ సభ్యులుగా రాపెల్లి రాజం, శ్రీనివాసగౌడ్, కంచర్ల శ్రీనివాస్, మోహన్, ఫయాజ్, రాజయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కమిటీ గోలేటి నుంచి గోదావరిఖని వరకు పనిచేస్తుందన్నారు.



మాట్లాడుతున్న శంకర్

## జగన్మాతా.. దీవించు!

- జంగుబాయికి ఎంపీ 'సోయం' పూజలు

**కెరమెరి(ఆసిఫాబాద్):** మండలంలోని తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దులోని మహరాజ్‌గూడ అడవుల్లో కొలువైన ఆదివాసీల ఆరాధ్య దేవత జంగుబాయిని ఆదివారం ఎంపీ సోయం బాపూరావు దర్శించుకున్నారు. సిద్దిసక, తోష్లకస, రావుడ్ దేవతలకు, ప్రత్యేక పూజలు చేశారు. మైసమ్మ, పోచమ్మతల్లికి మొక్కుకున్నారు. ఏటా దసరా పర్వదినం తర్వాత అమ్మవారిని దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. బోథ్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిగా అధిష్టానం తన పేరు ఖరారు చేసిందని, విజయం వరించేలా చూడాలని జంగుబాయిని వేడుకున్నట్లు ఎంపీ తెలిపారు.



రావుడ్ దేవతకు మొక్కుతున్న ఎంపీ

## రూ.5.89 లక్షలు సీజ్



పట్టుబడిన నగదుతో ఎస్సై సాగర్

**వాంకిడి:** మహారాష్ట్రలోని చంద్రపూర్‌కు చెందిన ఇద్దరు వ్యక్తుల వద్ద పట్టుబడిన రూ.5.89 లక్షల నగదు సీజ్ చేసినట్లు ఎస్సై సాగర్ తెలిపారు. మండలంలోని టోల్‌ప్లాజా వద్ద ఆదివారం నిర్వహించిన వాహనాల తనిఖీల్లో చంద్రపూర్ నుంచి ఆసిఫాబాద్ వైపు వెళ్తున్న నగేష్ అగర్వాల్ వద్ద నుంచి రూ.5లక్షలు, మహారాష్ట్ర సరిహద్దులో ఏర్పాటు చేసిన ప్రత్యేక చెక్‌పోస్టు వద్ద చంద్రపూర్‌కు చెందిన టెంగ్రే శరత్ వద్ద రూ.89 వేలు పట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. సరైన ఆధారాలు లేని కారణంగా నగదు సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

### ఓసీ సంఘాల అధ్యక్షుడిగా సంతోష్



జనగాం సంతోష్

**ఆదిలాబాద్‌టౌన్:** ఓసీ సంఘాల ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా ఆదిలాబాద్ పట్టణానికి చెందిన జనగాం సంతోష్ ఎన్నికయ్యారు. ఈమేరకు ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు కరుణాకర్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. రెండేళ్లుగా సంతోష్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఆయన సేవలను గుర్తించి ఉమ్మడి జిల్లా బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

### తీసుకున్న అడ్వాన్స్ చెల్లించాలని ఆందోళన



నిరసన తెలుపుతున్న బాధిత కుటుంబం

**జైపూర్:** రైస్ మిల్లు విక్రయిస్తానని తీసుకున్న అడ్వాన్స్ చెల్లించాలని మిల్లు యజమాని ఇంటి ఎదుట బాధిత కుటుంబం ఆందోళనకు దిగింది. జైపూర్ మండలం టీకుమట్ల గ్రామానికి చెందిన గుల్లపల్లి రాధ-సూర్యనారాయణ ఇదే గ్రామంలోని మహాలక్ష్మి రైస్‌మిల్లు విక్రయిస్తానని మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేటకు చెందిన తోట వినోద్ వద్ద నుంచి రూ.39లక్షలు అడ్వాన్స్‌గా తీసుకున్నాడు. మిల్లును ఇతరులకు విక్రయించడంతో పాటు తీసుకున్న అడ్వాన్స్ చెల్లించకపోవడంతో బాధిత కుటుంబం ఆదివారం సూర్యనారాయణ ఇంటిఎదుట ఆందోళనకు దిగింది. తమ డబ్బులను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు.

## మద్యం పట్టివేత

**బెల్లంపల్లి:** బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కన్నాలబస్తీలో ఆదివారం పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా దానం రవి అనే వ్యక్తి వద్ద నుంచి మద్యం బాటిళ్లు పట్టుకున్నట్లు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో బన్సీలాల్ తెలిపారు. రాయల్ స్టాగ్ 180 ఎంఎల్ బాటిల్స్- 6, డెక్కన్ బ్లూ 180 ఎంఎల్ బాటిల్స్-10, ఆఫీసర్స్ చాయిస్ 90 ఎంఎల్ బాటిల్స్-10 లభించాయి. వాటి విలువ రూ.4,860 వరకు ఉంటుందన్నారు. అనంతరం బెల్లంపల్లి పాత బస్టాండ్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో కన్నాలబస్తీకి చెందిన రాపల్లి శారద వద్ద ఐబీ 180 ఎంఎల్ బాటిల్స్-5, ఆఫీసర్స్ చాయిస్ 90 ఎంఎల్ బాటిల్స్-18 పట్టుబడ్డాయి. వాటి విలువ రూ.2,340 విలువ ఉంటుందని ఎస్‌హెచ్‌ఓ బన్సీలాల్ తెలిపారు. ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

**నంబర్-2 ఇంక్లైన్ బస్తీలో...**

నంబర్-2 ఇంక్‌లైన్ బస్తీలోని ఓ కిరాణా షాపులో అమ్మకానికి సిద్ధంగా ఉంచిన మద్యం బాటిళ్లను టూటౌన్ పోలీసులు పట్టుకున్నారు. ఆఫీసర్స్ చాయిస్ 90ఎంఎల్ బాటిల్స్-10 , ఐబీ 180 బాటిల్-1 స్వాధీనం చేసుకున్నట్లు టూటౌన్ ఎస్సై రమేశ్ తెలిపారు. కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.


**భీమిని:** మండలంలోని వీగాం గ్రామంలో ఆదివారం పెట్రోలింగ్ చేస్తుండగా మద్యం బాటిళ్లు లభ్యమైనట్లు కన్నెపల్లి ఎస్సై నరేష్ తెలిపారు. కొయ్యడ సత్యాగౌడ్ అనే వ్యక్తిని తనిఖీ చేయగా అతని వద్ద 20 మద్యం బాటిళ్లు (90 ఎంఎల్) లభించాయని, వాటి విలువ రూ.2 వేలు ఉంటుందన్నారు. అతన్ని విచారించగా కొంత కాలంగా తన ఇంటి వద్ద బెల్ట్‌షాపు నడుపుతున్నట్లు తెలిపాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.



నిందితుడి అరెస్టు చూపిస్తున్న ఎస్‌హెచ్‌వో

## 'కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు గుణపాఠం చెప్పాలి'

**మందమర్రిరూరల్:** ముస్లింలకు ఇచ్చిన హామీలను విస్మరించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని ముస్లిం జాక్ రాష్ట్ర కోఆర్డినేటర్ యూసుఫ్‌బాబా అన్నారు. ఆదివారం పట్టణంలోని మంజునాథ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ముస్లిం డిక్లరేషన్ సదస్సుకు హాజరై మాట్లాడారు. తెలంగాణలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్ కల్పించలేదని మండిపడ్డారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కూడా మోసం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ముస్లింలకు 22 డిమాండ్ల డిక్లరేషన్ అమలు చేసే పార్టీని గెలిపించుకోవాలనే ఉద్దేశంతో సదస్సు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సదస్సు కన్వీనర్ ఇబ్రహీం, ఇషాక్, వజీర్ సుల్తాన్, రహమాన్, షేక్ అజీమొద్దీన్, జాఫర్, షేక్ మహ్మద్, మత పెద్దలు లతీఫ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యూసుఫ్ బాబా

## అభయారణ్యంలో అందమైన భవనం

- ప్రారంభానికి ముస్తాబైన వాచ్ టవర్

**వేమనపల్లి:** కలప అక్రమ రవాణా నివారణ, వన్యప్రాణుల సంరక్షణకోసం అటవీశాఖ అడవిలో వాచ్ టవర్ల నిర్మాణానికి చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా జిల్లాలోని మంచిర్యాల, జైపూర్, బెల్లంపల్లి, కుశ్నపల్లి రేంజ్, వేమనపల్లి సెక్షన్‌లోని అటవీ ప్రాంతాల్లో వాచ్‌టవర్ నిర్మాణం పూర్తి అయ్యింది. సుమారు రూ.12 లక్షల నిధులతో మూడు అంతస్తుల భవనాన్ని నిర్మించారు. రెండు రోజుల్లో కాళేశ్వరం ఎఫ్‌డీపీటీ, సీఎఫ్ వినోద్‌కుమార్, డీఎఫ్‌ఓ ఆశిస్‌సింగ్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేసేందుకు సిద్ధం చేస్తున్నారు. రేంజ్ అధికారి గోవింద్‌చంద్ సర్దార్ ఆధ్వర్యంలో భవనానికి రంగుల అద్దకం, వైరింగ్ పనులు పూర్తి చేశారు. ఆకుపచ్చని అడవిలో అదే రంగుతో వన్యజీవుల చిత్రాలతో ముస్తాబు చేస్తున్నారు.

**మూడు వైపులా దారులు**

టైగర్ రిజర్వు ప్రాంతం కావడంతో ఇప్పటికే మూడు వైపులా రోడ్లు నిర్మించారు. అవసరం ఉన్న చోట ఒర్రెలపై లోలెవల్ వంతెలను నిర్మించారు. టవర్ వద్దకు వెళ్లేందుకు వేమనపల్లి నుంచి రాజారాం మీదుగా ప్రత్యేక రోడ్డు ఏర్పాటు చేశారు. కొమురంభీం జిల్లా గిరివెల్లి అటవీ ప్రాంతం వైపు నుంచి, నాగారాం లోతొర్రె ఆర్‌అండ్‌బీ రోడ్డు వరకు రోడ్లు వేశారు. వాచ్‌టవర్‌కు 10 కిలోమీటర్ల దూరం నుంచి మూడు వైపులా రోడ్లు పూర్తి అయ్యాయి. ఏ సమయంలోనైనా ఉన్నతాధికారులతో పాటు స్థానిక సిబ్బంది టవర్ వద్దకు వెళ్లేందుకు దారులు సిద్ధం చేశారు. అవసరమైతే టవర్ వద్దే రాత్రిపూట బస చేసేందుకు ఏర్పాట్లు సిద్ధం చేశారు.



ముస్తాబైన వాచ్‌టవర్